నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, శనివారం 2 నవంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం



శుక్రవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

# పాత పనులకు.. కొత్త ఫలకాలు!

**గతంలో ఉన్నవి తొలగించి.. మళ్లీ శిలాఫలకాల ఏర్పాటు**

- **బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులకే శంకుస్థాపనలు**
- **ఇదీ పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే తీరు**

పరకాల, నవంబర్ 1 : 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్నట్లు ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు.. ఒక్క కొత్త అభివృద్ధి పనిని తెచ్చింది లేదు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులకే కొత్తగా శంకుస్థాపనలు చేయడం కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే చెల్లింది. ఈ అంశం ప్రస్తుతం పరకాల నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలోని దామెర మండలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా మండలంలోని సింగరాజుపల్లి, వెంకటాపురం, ల్యాదెళ్ల హరిచంద్రనాయక్ తండా వాసుల కోరిక మేరకు అప్పటి సీఎం కేసీఆర్‌తో చర్చించి బీటీ రోడ్డు నుంచి హరిచంద్రునాయక్ తండా, సింగరాజుపల్లె వరకు రూ.3.04 కోట్ల ఎస్టీఎస్డీఎఫ్ నిధులను మంజూరు చేయించి గత ఏడాది అక్టోబర్ 2న పనులు ప్రారంభించారు. కాగా శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఈ శిలాఫలకాన్ని మార్చి కొత్తగా పనులకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలైనా నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోగా.. గత బీఆర్ఎస్ హయాంలో శంకుస్థాపన చేసిన పనులనే తిరిగి ప్రారంభించడం ఏమిటని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే తన దృష్టిని అభివృద్ధిపై కాకుండా శిలాఫలకాలను మార్చడంపై పెడితే ఎలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# నేతకాని బతుకమ్మ షురూ

- **సీతంపేటలో మూడు రోజుల పాటు వేడుకలు**
- **దీపావళి నుంచి జరుపుకోవడం ఆనవాయితీ**



చెరువు నుంచి మట్టిని తీసుకొస్తున్న నేతకాని కులస్తులు

హసన్‌పర్తి, నవంబర్ 1: మండలంలోని సీతంపేటలో నేతకాని కులస్తుల బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముందు రోజు నుంచి బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. కానీ ఇక్కడ దీపావళి నుంచి మూడు రోజుల పాటు వైభవంగా జరుపుకుంటారు. ఇందులో భాగంగా నేతకాని కులస్తులు శుక్రవారం సాయంత్రం చెరువు వద్దకు వెళ్లి రాగడి మట్టి, గంగా జలాన్ని సేకరించారు. వాటితో ఎడ్ల ప్రతిమలు చేసి పిండి వంటలు బహూకరించి కేదారేశ్వర స్వామి వద్ద పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. రెండోరోజు శనివారం మట్టితో చేసిన ఎడ్ల ప్రతిమలకు కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం పురుషులు మాత్రమే కోలాటాలు ఆడుతూ పురవీధుల గుండా కేదారేశ్వరున్ని కొలుస్తూ పల్లెంలో ఎడ్ల ప్రతిమలను పెట్టి ఊరేగింపుగా వెళ్లి ఊరు శివారులోని చెరువులో నిమజ్జనం చేస్తారు. అనంతరం ఇండ్లకు వచ్చి మరుసటి రోజుకు పరమాన్నం వండడానికి బియ్యాన్ని నానబెడతారు. చివరిరోజు ఆదివారం సాయంత్రం బతుకమ్మలు తయారు చేసి ఊరు చివర చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి ఒక చోట పెట్టి స్త్రీ, పురుషులు కలిసి ఆటాపాటలతో సందడి చేస్తారు. అనంతరం వెంట తెచ్చుకున్న గురుగులకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. అనంతరం పిండి వంటలు వాయనంగా ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు హాజరవుతారు.

# చదరంగంలో చిచ్చరపిడుగు

**అంతర్జాతీయస్థాయి రేటింగ్ సాధించిన దేవాన్ష్‌రెడ్డి**



హనుమకొండ చౌరస్తా, నవంబర్ 1: చెస్‌లో ఈ బుడతడు చిచ్చరపిడుగులా అద్భుతాలు సృష్టించి అంతర్జాతీయస్థాయి రేటింగ్ సాధించాడు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన బైరి రఘువీరారెడ్డి-దివ్యారెడ్డిల కుమారుడు దేవాన్ష్‌రెడ్డి(6) ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన అంతర్జాతీయస్థాయి రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో 1485 రేటింగ్ సంపాదించాడు. రాంనగర్‌లోని మాంటిసోరి చిల్డ్రన్స్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతూ ప్రైవేట్ కోచ్ వద్ద ఓనమాలు నేర్చుకొని, తల్లిదండ్రుల వద్ద మెళకువలు నేర్చుకొని అంతర్జాతీయ స్థాయిలో రాణించాడు. ఈ సందర్భంగా దేవాన్ష్‌రెడ్డిని వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య సభ్యులు కన్నా, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్ అభినందించారు.



శుక్రవారం బ్యాంకు నుంచి పింఛను తీసుకొని వెళ్తున్న ములుగు జిల్లా వాజేడు మండలంలోని పలు గ్రామాల వృద్ధ మహిళలు



- **పింఛన్ పెంచి ఇస్తామన్న హామీ గాలికి..**
- **కొత్త పెన్షన్ల మంజూరు ఊసెత్తని సర్కారు**
- **ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు**
- **ప్రస్తుత పింఛన్లూ ఆలస్యంగా అందజేత**
- **హనుమకొండ జిల్లాలో ఇంకా 7,493 దరఖాస్తులు పెండింగ్**

# చేయూత ఎప్పుడు?

## కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు

హనుమకొండ, నవంబర్ 1 : తాము అధికారంలోకి వస్తే చేయూత (ఆసరా) పింఛన్లు పెంచి ఇస్తామని, కొత్తవి మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ఎప్పుడు అమలవుతుందని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటై పదినెలలైనా ఆ ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓటేస్తే నట్టేట ముంచారని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రతి నెలా పింఛన్లు వచ్చేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నెలల తరబడి ఆలస్యమవుతున్నాయని మండిపడుతున్నారు. పింఛన్ డబ్బులపై ఆధారపడి జీవిస్తున్న తాము ఇబ్బందులు పడుతున్నామని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు వాపోతున్నారు. దీనికి తోడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తామంటూ ఆర్భాటంగా తీసుకున్న దరఖాస్తులకు ఇంకా మోక్షం లభించడం లేదు. పెంచే పింఛన్ కోసం లబ్ధిదారులు, కొత్త వాటి కోసం దరఖాస్తుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**రోజురోజుకూ పెరుగుతున్న దరఖాస్తులు**



కొత్త పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటుండడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వాటి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నెలా కొత్త పింఛన్లు మంజూరు చేసేది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. హనుమకొండ జిల్లాలో ఇప్పటి వరకు 7,493 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. వీరిలో వృద్ధులు 2,152, వితంతువులు 2,427, వికలాంగులు 1,307, కల్లుగీత కార్మికులు 476, చేతనే కార్మికులు 253, బీడీ కార్మికులు 254, ఒంటరి మహిళలు 594 మంది ఉన్నట్లు సమాచారం.

**బీఆర్ఎస్ హయాంలో..**

గతంలో కేసీఆర్ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అండగా నిలిచిందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 200 ఉన్న పింఛన్‌ను రూ. 1,000కి, రూ. 500 ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 1,500కు పెంచింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలకిచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్‌ను రూ. 2,016కు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 3,016కు పెంచి అండగా నిలిచింది. ప్రతి నెలా ఠంచన్‌గా పింఛన్‌దారులకు అందజేసింది. కాగా, గత ఆగస్టు నెలకు సంబంధించిన పింఛన్లు ఈ నెలలో లబ్ధిదారులకు అందజేసినట్లు ఆ శాఖ అధికారులే చెప్పడం గమనార్హం.

**నిబంధనల మేరకే పింఛన్లు..**

ప్రభుత్వ నిబంధనల మేరకే ప్రతి నెలా పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. పింఛన్ పెంచడం, కొత్తవి మంజూరు చేయడంపై ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. కొత్తగా వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించి నివేదికను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అందజేస్తున్నాం. అలాగే సెప్టెంబర్ నెల పింఛన్లకు సంబంధించి ఎఫ్‌టీవో జనరేట్ చేశాం. **– నాగపద్మజ, డీఆర్‌డీవో, హనుమకొండ జిల్లా**

# సింగరేణి అధికారుల నిర్లక్ష్యం..

## పంట పొలాలకు శాపం..



ఓసీ-3 నుంచి వచ్చిన బురద నీటితో నామరూపాల్లేకుండా పోయిన మిర్చి పంట

గణపురం, నవంబర్ 1 : బురద నీటితో నిండిన ఈ భూములు రైతులు సాగుచేసుకుంటున్న పంట పొలాలు. సింగరేణి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒండ్రు మట్టి నీరు చేరి పంటలు పనికి రాకుండా పోయాయి. దీంతో తమకు నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని శుక్రవారం బాధిత రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని ధర్మారావుపేట రెవెన్యూ గ్రామ శివారులో సింగరేణి సంస్థ ఓసీ-3 గనిని నిర్వహిస్తున్నది. తవ్వకాల్లో భాగంగా తీసిన ఓవర్ బర్డెన్ (మట్టి)ని గని హద్దుల వెంట పోస్తున్నారు. అయితే సింగరేణి సంస్థ గనికోసం కేటాయించిన భూముల హద్దుల వెంట ట్రెంచ్ (కాలువ) కొట్టాల్సి ఉంటుంది. ఈ పనులు చేయకుండానే మట్టిని గుట్టలుగా డంప్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వచ్చిన వరద సింగరేణి పోసిన మట్టిని తీసుకొచ్చి ఈ పొలాల్లో వదలడంతో మిర్చి, మినుము తదితర పంటలు నేలమట్టమయ్యాయి. నగరంపల్లి గ్రామానికి చెందిన రైతులు పండిస్తున్న ఇడబోయిన సంతోష్‌కు చెందిన మూడెకరాలు, గొర్రె నాగరాజు,కొడారి ధనుంజయ్ ఎకరం చొప్పున, ఇడబోయిన రవి 20 గుంటల్లో సాగు చేసిన మిర్చితో పాటు గొర్రె రవి మూడెకరాల్లో వేసిన మినుము, ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చుట్టూ ట్రెంచ్ ఉంటే వర్షపు నీరంతా అందులోకి వెళ్లేది కాదని, సింగరేణి అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని రైతులు వాపోయారు. ప్రస్తుతం మిర్చి పంట పూత, పిందె స్థాయిలో ఉందని, బురద నీటితో పూర్తిస్థాయిలో నష్టం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ కలెక్టర్, ఆర్డీవో, సింగరేణి అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

# గిరిజన యూనివర్సిటీకి భూమి కేటాయింపు

**కేంద్రానికి అప్పగిస్తూ జీవో 114 జారీ**

ములుగు, నవంబర్1(నమస్తేతెలంగాణ) : రాష్ట్ర విభజన హామీలో భాగమైన సమ్మక్క-సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి ములుగు జిల్లా కేంద్రంలో 211 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం జీవో నంబర్ 114ను జారీ చేశారు. యూనివర్సిటీ ఏర్పాటు కోసం గట్టమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న రెవెన్యూ, అటవీ శాఖకు చెందిన 337ఎకరాల భూమి అనువైనదిగా గత ప్రభుత్వ హయాంలో గుర్తించి కేంద్రానికి నివేదిక సమర్పించగా 2024 మార్చిలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. అదే నెలలో తాత్కాలిక తరగతులను జాకారం వైటీసీలో ప్రారంభించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ములుగు పరిధిలోని సర్వే నంబర్ 837/1లో రూ.10,58,31,250 విలువైన 211.26 ఎకరాల భూమిని అప్పగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



భూపాలపల్లిలో పటాకులు కాల్చుతున్న ప్రజలు

# అమావాస్య నిశిలో.. దీపావళి కాంతులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. గురు, శుక్రవారాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో కేదారేశ్వర నోములు, సత్యనారాయణ వ్రతాలు జరుపుకున్నారు. స్వీట్లు, పిండి పదార్థాలు తయారుచేసి దేవుడికి నైవేద్యం సమర్పించారు. ఊరూరు దీపాల కాంతులతో కళకళలాడాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా కాల్చిన పటాకులు అమావాస్య చీకటిలో వెలుగులు నింపాయి. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



బయ్యారంలో తడిసిన మక్కలను ఆరబోస్తున్న రైతులు



బచ్చన్నపేట కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం


# అకాల వర్షానికి తడిసిన ధాన్యం


**ఆరబోసిన మక్కజొన్నకూ నష్టం**

బచ్చన్నపేట/బయ్యారం, నవంబర్ 1: అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు బచ్చన్నపేట మార్కెట్‌కు తరలించి ఆరబోసుకోగా శుక్రవారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. మార్కెట్‌ను సందర్శించిన జేసీ బాధిత రైతులు, సివిల్‌సప్లై డీఎంతో మాట్లాడారు. తడిసిన మూడు లారీల లోడ్ ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి మిల్లుకు పంపాలని ఆదేశించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి రామారావునాయక్, ఏపీఎం నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో మల్లికార్జున్, ఆర్ఐ మున్వర్ పాల్గొన్నారు. అదేవిధంగా బయ్యారం ఏజెన్సీలోని గ్రామాల్లో మక్కజొన్నను అమ్ముకునేందుకు రైతులు ఆరబోసుకున్నారు. శుక్రవారం వర్షం కురిసి రైతులకు నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన పంట తడవడంలో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# పండుగ పూట విషాదం

- **బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి**
- **వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రమాదం**





నారాయణరెడ్డి, రవీందర్(ఫైల్)

రఘునాథపల్లి నవంబర్1: మండలంలోని వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గోవర్ధనగిరి బస్టాండ్ సమీపంలో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పండుగ పూట వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవర్ధనగిరి గ్రామానికి చెందిన సంపత్ నారాయణరెడ్డి(60), లింగాలఘనపురం మండలంలోని నవాబుపేటకు చెందిన కడార్ల రవీందర్(59) గోపాలస్వామిగుట్ట సమీపంలోని మహేశ్ ఫ్యాట్స్ అండ్ ఆయిల్ మిల్లులో పనిచేస్తున్నారు. గురువారం పనులు ముగించుకొని సాయంత్రం టీవీఎస్ బైక్‌పై ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కారు యూటర్న్ తీసుకొని తిరిగి కాజీపేట వైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఎల్అండ్‌టీ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగకపోవడంతోనే తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ఎన్‌హెచ్ అధికారులు లైటింగ్‌ను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నేడు బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

హనుమకొండ, నవంబర్ 1 : రాష్ట్రవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా శనివారం రాష్ట్ర బీసీ కమిషన్ బృందం హనుమకొండకు వస్తున్నట్లు కలెక్టర్ పీ ప్రావీణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి దామాషా ప్రకారం ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుల సంఘాల ప్రతినిధుల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



సరస్సులో పెడల్ బోటింగ్ చేస్తున్న టూరిస్టులు

# సరస్సులో మరింత సరదా!

- **లక్నవరంలో పర్యాటకులకు నయా జోష్**
- **వాటర్ రోలర్ సహా పలు బోటు సౌకర్యాలు ప్రారంభం**

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు మరింత సరదా అందించనున్నది. పర్యాటకుల్లో సరికొత్త జోష్ నింపేందుకు కొత్త అందాలను అందిపుచ్చుకుంటున్నది. తాజాగా శుక్రవారం ఫ్రీకోర్స్ ఆధ్వర్యంలో మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. వాటర్ రోలర్, కాయకింగ్, పెడల్, హంస బోటులను ప్రారంభమయ్యాయి. అయితే ప్రైవేట్ భాగస్వామ్యంతో పర్యాటకుల అభిమానాన్ని చూరగొంటున్నప్పటికీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోటు షికారు ఆదాయానికి గండి పడనుందని పలువురు అంటున్నారు.

**- గోవిందరావుపేట, నవంబర్ 1**



హంసబోటులో పర్యాటకులు



కాయకింగ్ బోటింగ్



వాటర్ రోలర్